వైద్య ఆరోగ్య శాఖ
బదిలీలపై విచారణ
- నిర్వేదంలో ఆర్‌డి కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీల అవకతవకలపై విచారణ చేపట్టారు. శనివారం ఉదయం 11.30 గంటలకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి డాక్టర్ కోటేశ్వరి రీజినల్ డైరెక్టర్ కార్యాల యానికి చేరుకున్నారు. రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఆరోపణలు ఉన్న బదిలీలకు సంబంధించిన సెక్షన్ అధికారులను విచారించారు. ఆరోపణలు ఉన్న బదిలీలను, సంబంధిత ఉద్యోగుల ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం సంబంధిత ఉద్యోగుల వాదనలను ఆలకించారు. సంబంధిత బదిలీలకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించినట్లు సమాచారం. వైద్య ఆరోగ్య శాఖ గతే డాది నుంచి ఇటీవలి వరకు చేపట్టిన ఉద్యోగుల బదిలీల్లో ఇష్టారాజ్యం నడిచిందనే పేరున ప్రజాశక్తిలో వార్తలు ప్రచురించిన సంగతి తెలిసిందే. వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి కృష్ణబాబు ఆలస్యంగానైనా స్పందించి విచార ణకు ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పిలు మొదలుకుని సీనియర్ అసిస్టెంట్స్, ఇతర సెక్షన్ల ఉద్యోగుల బదిలీల్లోని పారదర్శకతను పరిశీలించాల్సి ఉంది.

కేసులను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీదేవి

ప్రజా వినియోగిత సేవలపై ఆయా శాఖలకు వచ్చిన కేసులను తక్షణమే పరిష్కరించాలని చైర్మన్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అన్నారు. సంయుక్తంగా శనివారం స్థానిక జిల్లా కోర్టు కాంప్లెక్స్ నందలి న్యాయసేవా సదన్‌లో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై వివిధ శాఖల జిల్లా అధికారులకు అవగాహన, సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని చెప్పారు. పర్మినెంట్ లోక్ అదాలత్ (పిఎల్ఎ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందిస్తుందని తెలిపారు. పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో ఎలాంటి అవాంతరాలు, లోపాల వల్ల వాటిల్లే నష్టాలకు సంబంధించి త్వరితగతిన న్యాయ పరిష్కారం పొందవచ్చన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పర్మనెంట్ లోక్ అదాలత్ మెంబెర్స్ ఎం.వి. సుబ్బారెడ్డి, ఎం. ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తే చర్యలు
- జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్

ప్రజాశక్తి - కడప

స్కూల్ వాహనాల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు జరిమానా, కేసులు నమోదు చేస్తామని జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ హెచ్చరికలు జారీ చేశారు. స్కూలు పిల్లల్ని రవాణా చేసే ఆటోలలో పరిమితికి మించి రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు శనివారం ప్రత్యేక తనిఖీ బృందాలతో కడప నగరంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అధిక లోడుతో విద్యార్థులను రవాణా చేస్తున్న ఆరు ఆటోలను సీజ్ చేశామన్నారు. ముగ్గురు సామర్థ్యం గల ఆటోలలో ఆరుగురు స్కూల్ విద్యార్థులు, నలుగురు సామర్థ్యం గల ఆటోలు అయితే 8 మంది విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. స్కూల్ బ్యాగులు క్యారియర్లు మొదలైనవి ఆటోలకు బయటవైపు వేలాడదీయరాదని, వెనుక వైపు డోరు ఓపెన్ చేసి పిల్లలని కూర్చోనీయరాదన్నారు. పిల్లలే మన భవిష్యత్తు.. కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత స్కూల్ యాజమాన్యాలు కూడా వారి పిల్లల కోసం శ్రద్ధ వహించి పరిమితికి లోబడి మాత్రమే ఆటోలో విద్యార్థులను పంపించాలన్నారు. దాడులు తరచూ కొనసాగుతాయని ఉపరవాణ కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు వై. ప్రసాద్, శ్వేత, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టని ప్రభుత్వం : ఎన్ఎస్‌యుఐ

మాట్లాడుతున్న మామిళ్ళబాబు

కడప : రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా హాస్టల్లో ఉన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పేద బడుగు బలహీన విద్యార్థుల బతుకులు హాస్టళ్లల్లో ఆకలికేకలుగా మారడం దారుణం అన్నారు. హాస్టల్లో కనీస మౌలిక వసతులను కల్పించాలన్నారు. నాడు - నేడు కార్యక్రమం కింద నూతన హాస్టల్ భవనాలు నిర్మించాలన్నారు. మెస్, కాస్మోటిక్ బిల్లులను విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు ఇంత వరకు 8 నెలలు కావస్తున్నా ఒక్క రూపాయి కూడా ఇంత వరకు ఇవ్వక పోవడం అన్యాయం అని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి హాస్టళ్ల విద్యార్థుల ఆకలి కేకలు తీర్చాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నగర నాయకులు మహేష్, బాషా పాల్గొన్నారు.

నేర్చుకున్న అంశాలను మరవకూడదు

కడప : శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిజజీవితంలో అలవాటుగా చేసుకోవాలని ఎన్‌సిసి 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాజ్ కుమార్ తాప అన్నారు. కడప నగరంలోని తెలుగు గంగ కాలనీలో శనివారం ఎన్‌సిసి కేడెట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఎన్‌సిసి కేడెట్లకు ఎన్‌సిసి, ఎ,బి, సి సర్టిఫికెట్లు కోసం పరీక్షలు రాసే కేడెట్లకు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా శిబిరంలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ మహేష్, పొన్నతోట రాజు పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిస్నోయ్, సి.ఎల్.రెడ్డి, జగదీష్, కొండా రెడ్డి ఆఫీసు సిబ్బంది సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, ప్రియ, రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి

కడప : డిసెంబర్ 9న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, టిఎల్ఎస్ సెకరెటరీ ఎం. ప్రదీప్ కుమార్ కోరారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో పోలీస్ అధికారులతో, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలన్నారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622లో కాని, istricts.ecourts. gov.in/Kadapa, dlsakdp@gmail.com లో కాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, సెకండ్ ఎడిఎం కోర్టు జడ్జ్ నందిని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎసిఎ అండర్-23 మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభం అయ్యాయి. కెఎస్ఆర్ ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ సౌత్ జోన్ జట్లు తలపడ్డాయి. వంశీకృష్ణ సెంచరీ చేయడంతో సెంట్రల్ గవర్నమెంట్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 374 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 66.3 ఓవర్లలో 374 పరుగులకు అయింది. ఆ జెట్టులోని వంశీకృష్ణ 120 పరుగులు చేశాడు. వసంత వర్ధన్ 69, దుర్గా బాలాజీ 66 పరుగులు చేశారు. సౌజోన్ జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 5, అఖిల్ సాలుంకే 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 19.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 26న ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని, విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

పోరుమామిళ్ల : యోగి వేమన యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రొద్దు టూరులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజ్ ఎట్ స్పోర్ట్స్ మీట్‌లో పోరుమామిళ్లకు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి చదువుతున్న ఎ. రేవతి ట్రిపుల్ జంప్ విభాగంలో ప్రథమ బహుమతి, అలాగే 400 మీటర్ల పరుగు పందెం విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి సత్తాచాటిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్ రావు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారెడ్డి , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రేవతిని అభినందించారు.

సామాన్య జనంలో
విభిన్న ప్రతిభావంతులు ఒక భాగమే
కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖా మంత్రి నారాయణ స్వామి

కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి - కడప అర్బన్

సామాన్య జనంలో విభిన్న ప్రతిభావంతులు కూడా ఒక భాగమే అని గుర్తించిన భారత ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, పునరావాస సేవలతో పాటు సాధికారత కోసం పాటుపడుతోందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖా మంత్రి ఎ. నారాయణ స్వామి పేర్కొన్నారు. శనివారం 'సామాజిక్ అధికారిత శివిర్' కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా 20 క్యాంపుల ద్వారా ఎడిఐపి ప్రత్యేక పథకం ద్వారా అలింకో సంస్థ సౌజన్యంతో నాణ్యమైన ఉప కరణాల పంపిణీ కార్యక్రమం జడ్‌పి సభాభవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులు కూడా ఒకరుగా ఉండాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోడీ దేశ వ్యాప్తంగా తీసుకు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. 16 నెలల కిందట జిల్లాకు వచ్చినపుడు విభిన్న ప్రతిభా వంతులకు సహాయ ఉపకరణాల అవసరాన్ని గుర్తించి కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. వెంటనే అందుకు సంబంధించిన కార్యాచరణ చేపట్టిన కలెక్టర్ ఆలింకో ప్రతినిధులతో మాట్లాడి 42 క్యాంపులు, 6509 మంది లబ్ధిదారులను గుర్తించారని పేర్కొన్నారు. ఆ మేరకు వారి వారి అవసరాలను గుర్తించి సహాయ ఉపకారణాలను అందించినట్లు చెప్పారు. జవాబుదారీ నాయకత్వాన్ని అందించిన ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలను అందిస్తూ వారి జీవన విధానాన్ని వికశింపజేయాలన్నారు. తాను కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఇప్పటి వరకు 14 వేలకు పైగా క్యాంపులు నిర్వహించి విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి అవసరమైన సహాయ ఉపకారణాలను అందించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పేద ప్రజలకు అందుతున్న విద్య, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మొదలైన అన్ని రకాల సాయాన్ని విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులు ఏ ఒక్కరూ కూడా అసంతృప్తిగా జీవితం గడపకూడదనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న ప్రతిభావంతుల అవసరాలను తీర్చతగిన అత్యాధునిక సహాయక పరికరాలు, పునరావాస సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ అవయవ లోపాలున్న విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవ పరికరాలు, సహాయక ఉపకరణాలను అందించే బృహత్తర కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని 6,509 మంది విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, ఆలింకో సంస్థ ఔదార్యం, జిల్లా ప్రత్యేక చొరవతో ఈ బృహత్తర మహా కార్యంగా దిగ్విజయం అయిందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సి.ఎం.రమేష్, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆలింకో డిప్యూటీ జీఎం సంజయ్ సింగ్, కడప ఆర్‌డిఒ మధుసూదన్, ఎస్ఎస్ఎ పిఒ ప్రభాకర్ రెడ్డి, డిసేబుల్ శాఖ ఎడి కృష్ణ కిషోర్, సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి
- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, జెసి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫిరెన్సు ద్వారా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ,పరిశ్రమలు, భూ రీ సర్వే, నేషనల్ హైవేస్ లాండ్ ఆక్విజేషన్, వ్యవసాయం, హౌసింగ్, యుజి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ తదితర అంశాల్లో ఇప్పటి వరకు సాధించిన పురోగతి మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సమీక్ష చేశారు. కలెక్టరేట్‌లోని విసి హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజుతోపాటు జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డిఆర్ఒ గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందించాలని ఆదేశించారు .జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పనులను అన్ని జిల్లాల్లో వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూ సేకరణ, పరిహారం ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.మండలాల వారీగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించాలని జడ్‌పి సిఇఒ, డిపిఒలకు సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా అగ్రికల్చర్ జెడి నాగేశ్వరరావు, సిపిఒ వెంకట్రావు, హౌసింగ్ పీడీ క్రిష్ణయ్య, పశుసంవర్ధకశాఖాధికారి శారదమ్మ, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాశినాయన : బాల్య వివాహాలు చేస్తే నేరమని, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని వెలుగు సిసి అనంతయ్య పేర్కొన్నారు. శనివారం వెలుగు ఎపిఎం ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు 'బాల్య వివాహాలు.. మహిళలపై హింస' అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్‌లలో మానవహారం నిర్వహించారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించి, మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి నజీమ సిసిలు సునీల్ సిద్దయ్య ప్రతాప్, యానిమేటర్లు, విఒఎలు, జెండర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **వల్లూరు :** సమాజంలో లింగ బేధం ఉండకూడదని జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా వల్లూరులో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. మహిళా సభ్యులతో ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సమావేశంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపిడిఒ జయశ్రీ, ఇఒపిఆర్‌డి ప్రసాద్, మండల సమాఖ్య సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో 'కెఎస్ఆర్ఎం' విద్యార్థుల సత్తా

కడప అర్బన్ : ఆంధ్ర ప్రదేశ్ బాస్కెట్ బాల్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా(ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం) క్రీడా మైదానంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన మొదటి ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషులు, మహిళల బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో వై ఎస్ అర్ జిల్లా జట్టు తరపున కెఎస్ఆర్ఎం కళాశాల మహిళల జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ చార్యులు డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి తెలిపారు.ఈ సందర్భంగా వారు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఎస్. శశికళ, బి. పూర్ణిమ, సీ. కావ్యాంజలి, కే. అనిత కుమారి ని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) అభినందించారు.

పాఠశాలలకు వంట పాత్రలు వితరణ

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్దలు కోసం అవసరమైన వంట పాత్రలను ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ పంపిణీ చేశారు. శనివారం ఎంఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. మండలంలోని 43 పాఠశాలలకు పాత్రలను పంపిణీ చేశారు. వీటిని పాఠశాలనే ఉంచుకొని వినియోగించుకోవాలని ఎంఇఒ- 1 గంగిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ- 2 సునీత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కెవికె'కు జాతీయ స్థాయి పురస్కారం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపిక చేసినట్లు కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా చిరుధాన్యాలను ప్రోత్సహిస్తున్నందుకు గాను భారత చిరుధాన్యాల సంస్థ హైదరాబాద్ వారు కెవికెను ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపిక చేశారన్నారు. పురస్కారాన్ని ఈనెల 27న హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే అంతర్జాతీయ న్యూట్రి సీరియల్స్ సదస్సు 5.0 పురస్కారాన్ని అందజేస్తారని తెలిపారు, ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన కెవికె సిబ్బందికి రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్రగ్స్ నివారణలో విఫలం : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా విచ్చలవిడిగా జరుగుతున్నా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు విమర్శించారు. శనివారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణాలు మొదలుకుని పల్లె పల్లెకు గంజాయి విచ్చలవిడిగ సరఫరా అవుతోందని తెలిఆపరు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం వారి జీవితాలను నాశనం చేసే గంజాయిని మాత్రం అరికట్టలేకపోయిందని విమర్శించారు. ఇప్పుడు పట్టణాలు, పల్లెలు మాత్రమే కాదు ఏకంగా మెడికల్ కాలేజీల్లో హాస్టళ్లలో, ఆఖరికి పాఠశాలల్లో సైతం గంజాయి దొరకడం సిగ్గు చేటు అన్నారు. ఎంతో చరిత్ర కల్గిన కర్నూలు మెడికల్ కళాశాల హాస్టళ్లల్లో గంజాయిని ప్యాకెట్లు దొరకడం, ఒంగోలు రిమ్స్ కళాశాలలో గంజాయి సేవించి మెడికల్ విద్యార్థులు తీవ్రంగా కొట్టుకోవడం చూస్తుంటే రాష్ట్రంలో గంజాయి లేని చోటే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు భవిష్యత్తు నాశనం అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే స్పందించి గంజాయి కళాశాల హాస్టళ్లలోకి ఎలా వచ్చిందో విచారణ జరిపి బాధ్యులపై తీవ్రమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో విద్యార్థులకు,యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి తరచుగా హాస్టళ్లపర్యవేక్షించాలని కోరారు. విద్యార్థులు, ముఖ్యంగా యువత డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు విజయ్, స్టీఫెన్, సహాయ కార్యదర్శులు యూసఫ్,పవన్ నాయకులు యస్.సజీద,ఉదయ్ పాల్గొన్నారు.

'కెఒఆర్ఎం'లో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కడప అర్బన్

డాక్టర్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ భారతి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 200 మంది కళాశాల సిబ్బంది, విద్యార్థులకు కంటి సమస్యల పైన అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భారతి కంటి హాస్పిటల్ డాక్టర్ శివ తేజ రెడ్డి, వారి సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ జి. లావణ్య, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినే టర్, విభాగాధిపతులు రెడ్డి ప్రసన్న, రెడ్డి మురళి, మధుసూదన్ రావు, చంద్రకళ, రమేష్ బాబు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాకు ప్రాణ రక్షణ కల్పించండి'

కడప అర్బన్ : తిలక్ నగర్‌లో నివాసముంటున్న రేవతి, వెంకటసుబ్బమ్మ, లక్ష్మీపార్వతి తమకు న్యాయం చేయాలని, ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. నగరంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ తన చిన్న మామ సుబ్బరాయుడు తమపై దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాడని, తమను చంపడానికి ప్రయత్నిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని కోరారు. 20 ఏళ్లుగా తన అత్త తన భర్త సంపాదించిన డబ్బులు ఖాజేసి తన సొంత ఆస్తులు, ఇళ్లు పోగు చేసుకున్నారని చెప్పారు. తమకు కూడా 6 సెంట్లు స్థలం మిప్పిస్తానని రూ. 4 లక్షలు కాజేశాడని వాపోయారు. స్థలము ఇవ్వలేదని, డబ్బులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని, పోలీసులు కూడా సుబ్బరాయుడుకె వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఉరుసు ప్రారంభ సూచికంగా బెలూన్ ఎగురవేస్తున్న ఉప ముఖ్యమంత్రి

అమీన్‌పీర్ దర్గా ఉరుసు జిల్లా పండుగ
- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

అమీనీపీర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి అంజద్ బాషా అన్నారు. శనివారం స్థానిక నకాష్ ప్రాంతంలోని అమీన్‌పీర్ దర్గాలో ఉరుసు ఉత్సవాల సూచికంగా బెలూన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పీర్ దర్గా ఉరుసును జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉరుసు ఉత్సవాలకు రాష్ట్ర ప్రజలే కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ప్రజలే ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ప్రభుత్వ పరంగా కలెక్టర్ వారికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఉరుసుకు సంబంధించి ఒక బృందాన్ని మహోత్సవాలకు విజయవంతం కావడానికి నియమించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఆదివారం నుంచి గంధ మహోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అందుకు శుభసూచికంగా బెలూన్‌ను ఎగురవేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి ఒక చాదర్‌ను కూడా సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్, కార్పొరేటర్లు షేక్. మహమ్మద్ షఫీ, అక్బర్, నాయకులు జప్రుల్లా, కరముల, జైద్, దర్గా మేనేజర్ మహమ్మద్ ఖాన్, సహదారుడు కుతుబద్దీన్, ముజావార్ అమీర్ బాషా, మాట పెద్దలు, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కడప అర్బన్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డిడియుజికెవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో రాయలసీమ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు కడపలో ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి ఇస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాలవ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇస్తు న్నట్లు పేర్కొన్నారు. కోర్సులతోపాటు అదనంగా బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదు పాయం కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వంతో గుర్తిం చబడిన సర్టిఫికెట్ అర్హతను బట్టి ప్రయివేట్ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పి స్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9063082227లో సంప్రదించాలన్నారు.

మనోధైర్యం కల్పించడం అభినందనీయం

కడప అర్బన్ : అనంతపురంలో ఎపిపి కుటుంబ దాడిలో గాయపడిన మైనారిటీ బాలికను ఎట్టకేలకే అధికార పార్టీ మైనార్టీ నాయకులు ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజం, రాష్ట్ర మైనారిటీ వర్గాల ప్రభుత్వ సలహాదారులు హబీబుల్లా తోపాటు పలువురు మైనార్టీ నాయకులు, స్థానిక శాసనసభ్యులు అనంత వెంకట్రామిరెడ్డి పరామర్శించి బాధిత కుటుంబానికి మనో ధైర్యం కలిగించటం అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకులు, ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. శనివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ న్యాయ వాద వృతిలో ఉండి బాల కార్మిక చట్టం, బాలల హక్కుల చట్టాలు తెలిసిన ఏపీపి కుటుంబం బాలికను నిర్బంధించి ఇంట్లో పనికి పెట్టుకోవటం న్యాయవ్యవస్థను అవమానపరచడమేనని పేర్కొన్నారు. దోషులను రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత చట్టాలను అనుసరించి కేసును నమోదు అయ్యేలా పోలీస్ అధికారులకు ఆదేశించాలని కోరారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాల ఆదుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవాలని కోరారు. కులమతాలకు, రాజకీయాలకుతీతంగా స్పందించి సదరు ఘటనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పొలికేక
ప్రజాదృష్టి

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పొలికేక పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన పాదయాత్ర సమయంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరసనలు, వంటావార్పు కార్యక్రమం జయప్రదమైంది. మున్సిపల్ కార్మిక నాయకత్వం పోరాటాల వల్ల ఒనగూరే ప్రయోజనాల్ని కార్మిక శ్రేణులకు వివరించే ప్రయత్నం చేసింది. కార్మికులు సైతం నాయకత్వ ఆదేశాల మేరకు ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడం గమనార్హం. ప్రభుత్వం కార్మికుల నిరసనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించింది. పోలీసులు, ఉద్యమకారుల్లో ఎవరి ఎత్తుగడలు ఎలా ఉన్నా ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడంలో సిఐటియు సఫలీకృతమైందని చెప్పవచ్చు. దశాబ్దాల తరబడి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలుపుతూనే ఉన్న సంగతి తెలిసిందే. పనికి తగిన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, హెల్త్‌రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలకు వర్తింపజేయాలని కోరుతూ కార్మికులు నినదించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన వైసిపి సర్కారు పట్ల పెట్టుకున్న ఆశలు అడియాశలు కావడంతో నిరసన బాట పట్టింది. కోవిడ్-19 కార్మికులను ఆప్కాస్ చేర్చాలని, పిహెచ్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, అడిషనల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వర్తింప జేయాలని కోరింది. క్లాప్‌డ్రైవర్లకు రూ.18,500, డ్రైవర్లకు రూ.32 వేలు వేతనం ఇవ్వాలని, ఎలక్ట్రీషియన్లకు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. కొన్నేళ్లుగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే ఉంది. కానీ పాలకులకు చెవికి మాత్రం ఎక్కడం లేదు. మెరుగైన జీవన ప్రమాణాలను సాధించుకోవడానికి కనీస వేతనం అత్యవసరం. ఇటువంటి న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యమాలు చేయాల్సి రావడం విచారకరం. ప్రజాప్రతినిధులు జీతాలు, అలవెన్స్ పెంపకం విషయంలో ఒకన్యాయం. కార్మికుల విషయంలో మరొక న్యాయాన్ని అవలంబించడం దారుణం. ఇటువంటి ద్వంద్వ విధానాలే నిరసనలకు, ఉద్యమాలకు ఆజ్యం పోస్తున్నాయనే అంశాన్ని గమనంలో ఉంచుకోవాల్సి ఉంది. ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచి పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన కార్మికులు సమాజాన్ని అనారోగ్యాల బారి నుంచి కాపాడుతున్న వైనాన్ని విస్మరించడం అహేతుకమని గుర్తించాలి. పాలకుల వైఖరిని గమనించిన కార్మిక నాయకత్వం కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యుక్తులను చేయాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికలు ముగింట తమ న్యాయమైన హక్కులను కాపాడుకునేందుకు కార్మిక నాయకత్వం కార్మికులను చైతన్యవంతం చేయాలి. లేనిపక్షంలో మరో ఐదేళ్ల వరకు కార్మికుల న్యాయమైన హక్కులు పాలకులకు పట్టవనే విషయాన్ని వివరించాలి. వారిలోని చైతన్యం ఆధారంగా భవిష్యత్ కార్యక్రమాలకు రూపకల్పన చేసి, కార్మికుల హక్కులను సాధనకు అవసరమైన బృహత్తర కర్తవ్యం నాయకత్వాలపై ఉందని చెప్పవచ్చు.

– ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం వంట పాత్రలు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ వి.రవి శంకర్, వి.వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా మండలంలోని 62 పాఠశాలలకు వంట సామగ్రి మంజూరు చేసిందన్నారు. హస్తాలు, స్టీల్ బేసిన్, దబరాలు, స్టెయిన్ లెస్ స్టీల్ డీప్ లేబుల్ ఉంటాయన్నారు. వీటిని తహశీల్దార్ యామిని సహకారంతో ఎండియు వాహనాల ద్వారా పాఠశాలలకు అందజేశామన్నారు. వీటిని వంట వారు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎం ఆర్‌సి సిబ్బంది మహేష్, శ్రీను, అనిత, అంజనదేవి, సిద్దమ్మ, బయమ్మ పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ చేస్తున్న సిబ్బంది

యాప్‌ను ప్రారంభించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు శనివారం మైదుకూరు మండలం ఉప్పుకుంటపల్లిలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మైదుకూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి మాచూపల్లి రామచంద్ర నాయుడు సెల్‌ఫోన్‌లో యాప్‌ను కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిషోర్ యాదవ్, బూత్ ఇన్‌ఛార్జి, మైదుకూరు మండల తెలుగు యువత ప్రెసిడెంట్ మాచూపల్లి రమేష్ నాయుడు, మనోహర్, ప్రభాకర్‌రెడ్డి, శేషయ్య, మునిరెడ్డి, నాగసుబ్బయ్య, గంగయ్య, శిఖామణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లో యాప్‌ను చూపుతున్న టిడిపి నాయకులు

కార్యకర్తకు 'మారెడ్డి' సోదరుల పరామర్శ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బలపనూరులో టిడిపి కార్యకర్త హాజీవలిని తొండూరు మండల ఇన్‌ఛార్జి మారెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, సింహాద్రిపురం మండల ఇన్‌ఛార్జి మారెడ్డి జోగిరెడ్డి శనివారం పరామర్శించారు. హాజీ వలికి ఇటీవల కాలికి చికిత్స చేయించుకోవడంతో వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజవర్గంలోని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో తెలుగుదేశం జెండాను ఎగరేద్దాం అని వారు పిలుపునిచ్చారు.

ప్రయివేట్ ట్రావెల్స్ నిలువు దోపిడీని అరికట్టాలి

- తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో ప్రయివేట్ ట్రావెల్స్‌ల నిలువు దోపిడీని అరికట్టాలని శనివారం టిడిపి నాయకులు నల్లబోతుల నాగరాజు కోరారు. ఆ మేరకు స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో ఛార్జీలను వసూలు చేస్తున్నారన్నారు. పండుగ సీజన్, శనిఆదివారాల్లో ఛార్జీలు రెండుమూడు రెట్లు పెంచుతున్నారని తెలిపారు. దీనివల్ల పేద,మధ్య తరగతి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సత్వరం చర్యలు తీసుకోవాలని, లేనిచో వారం రోజుల్లో ప్రజా సంఘాలతో కలిసి అఖిలపక్ష కమిటీ ఏర్పాటు చేసి ఆర్‌టిఒ కార్యాలయం ఎదురుగా ధర్నా చేపడతామన్నారు. సోమవారం కలెక్టర్, జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషన్‌ను కలవనున్నట్లు నాగరాజు వివరించారు.

చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం

- నియోజకవర్గ పరిశీలకులు బుగ్గయ్య చౌదరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమని పులివెందుల నియోజకవర్గ పరిశీలకుడు బుగ్గయ్య చౌదరి పేర్కొన్నారు. మండలంలోని లోమడ, రామగిరి గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందన్నారు. పులివెందుల నియోజవర్గ టిడిపి అభ్యర్థి బీటెక్ రవిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. నియోజవర్గంలోని ప్రజలు వైసిపి పాలనలో జరుగుతున్న అరాచకాన్ని, అక్రమాలను గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బీటెక్ రవిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీటెక్ రవి తనయుడు రాంరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మారెడ్డి జోగిరెడ్డి, తొండూరు మండల కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, మండల నాయకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రకాష్‌రెడ్డి, టిడిపి నాయకులు సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : పట్టణ పరిధిలోని కొర్రపాడు రోడ్డు ఎస్ఎస్ రిలయన్స్ షాపింగ్ మాల్‌లో టిడిపి ఇన్‌ఛార్జి జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశానుసారం శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన భార్య మౌనిక నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, పొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, 37 వార్డ్ గంగాధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఆర్థిక అరాచకత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో ఆర్థిక అరాచకత్వం కొనసాగుతున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో జరుగుతున్న ఆర్థిక ఆరాచకత్వంపై సాక్షాత్తు కాగ్‌నే చెప్పిందన్నారు. సాధారణంగా బడ్జెట్‌లో చూపించిన విధానానికి దగ్గరగా వివిధ అంశాలకు వ్యయం ఉంటుందని చెప్పారు. కానీ జగన్ పాలనలో బడ్జెట్‌కు ఏమాత్రం విలువ లేకుండా పోయిందని విమర్శించారు. 2023 ఏప్రిల్ ఒకటి నుండి 2023 సెప్టెంబర్ 30 వరకు రూ.73.694 కోట్లను ఎలాంటి కేటాయింపులు లేకుండానే ఖర్చు చేసినట్లు గుర్తించిందన్నారు. 1914 అంశాలకు సంబంధించి బడ్జెట్‌లో రూ.34,171 కోట్లు కేటాయించినప్పటకీ అందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని కాగ్ స్పష్టం చేసిందని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వాన్ని దించడమే ఏకైక పరిష్కారం అన్నారు.

'చాపాటి' మరణం బాధాకరం

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ చాపాటి రామచంద్రారెడ్డి మృతి బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న చాపాటి రామచంద్రారెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. ఘటనపై బంధువులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, నరసింహరెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

మద్దిమడుగు కొండల్లో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని మద్దిమడుగు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌కు సమీపంలోని కొండల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. విఆర్ఒ చక్రధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చనిపోయిన వ్యక్తికి సుమారు 55-60 సంవత్సరాల మధ్య వయసు ఉంటుంది. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సచివాలయాల్లో సిబ్బంది కొరత

- అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు

సింహాద్రిపురం సచివాలయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో అవసరాల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండల వ్యాప్తంగా 20 పంచాయతీల్లో 32 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇందుకు అనుగుణంగా 12 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం సచివాలయాలకు కోట్లాది రూపాయలు వెచ్చించి భారీ భవనాలను నిర్మించింది. ఆ మేరకు క్షేత్రస్థాయిలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఐదు డిజిటల్ అసిస్టెంట్లు, నాలుగు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మూడు వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆరు పంచాయతీ సెక్రెటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే వీరి స్థానంలో ఇతర పంచాయతీల సిబ్బందిని ఇన్‌ఛార్జిలుగా నియమించారు. వీరు రెండు చోట్ల విధులు నిర్వహించాల్సి ఉంది. దీంతో వారు ప్రజలకు సక్రమంగా అందుబాటులో ఉండడంలేదు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సచివాలయానికి వెళితే అక్కడ సిబ్బంది లేక వెనుదిరిగి వస్తున్నారు.

ఆర్‌బికెల్లోనూ సిబ్బంది కొరతే..

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను నియమించింది. ఆర్‌బికె సిబ్బంది రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలి. అంతేకాక క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి పంటల్లో వచ్చే తెగులు నివారణకు సూచనలు ఇస్తున్నారు. మండల వ్యాప్తంగా నలుగురు అగ్రికల్చర్ అసిస్టెంట్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ్యమంత్రి ఇలాకాలోనే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది కొరత పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థలోనే సిబ్బంది కొరత ఉండడం ఏమిటని మండల వ్యాప్తంగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం..

మండలవ్యాప్తంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

- కృష్ణమూర్తి, ఎంపిడిఒ, సింహాద్రిపురం

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ఆదర్శనీయం

- వైసిపి సీనియర్ నేత వల్లంబాయి హృషికేశవరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

భారతదేశంలోనే సంక్షేమం, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదర్శనీయమని వైసిపి సీనియర్ నాయకులు వల్లంబాయి హృషికేశవరెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు నగర పంచాయతీ, మండలంలో విస్తృతంగా వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సామాజిక సాధికారతకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా సంక్షేమ పాలన అందిస్తూ ఐదు కోట్ల మంది ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటు అందించినందునే నేడు ప్రజలు జగనన్ననే మళ్లీ సిఎంగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికల ముందు కల్లబొల్లి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించకుండా పారిపోయే వారని, అందుకు భిన్నంగా నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని వందశాతం అమలు చేశారన్నారు. ఆ తర్వాతే ప్రజలను ఓటు అడుగుతున్నారని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు పేదలకు ఒక్క సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు ఎక్కడా లేవన్నారు. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 35 లక్షల ఇళ్ల స్థలాలు అందజేసి, ఆ స్థలాల్లో 25 లక్షల ఇళ్లను నిర్మించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యల పట్ల ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి వాటిని పరిష్కరిస్తున్నారని తెలిపారు. గత పాలకులకు భిన్నంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి యువతను ప్రోత్సహిస్తూ వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అతి త్వరలో జమ్మలమడుగు ప్రాంతంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగవంతమై, యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధీర్ రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వల్లంబాయి హృషికేశవరెడ్డి (ఫైల్‌ఫొటో)

శ్రమించే ప్రతి పేదవాడికీ అండగా ఉంటా :'రాచమల్లు'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిరుపేదలు, శ్రమించే వ్యక్తులు అంటే నాకు చాలా ఇష్టమని, అలాంటి వారికి తాను ఎప్పటికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మార్కెట్లో వ్యాపారం చేసుకునే వారి సమస్యలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వ్యాపారులు వినతిపత్రాన్ని ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా మార్కెట్ వ్యాపారులతో దగ్గర సంబంధం ఉందన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ఇబ్బందికరంగా ఉండే మార్కెట్‌ను తొలగించి తాత్కాలిక మార్కెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆ స్థలంలో అందమైన శాశ్వత మార్కెట్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.53కోట్లుతో కొత్త మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. దేశంలోనే అత్యున్నత మార్కెట్ ఇది చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఆరోజు మార్కెట్ కూల్చే రోజు చెప్పిన మాట.. ఈరోజు చెబుతున్నానని మార్కెట్లో ఉన్న ప్రతి ఒక్కరికి అక్కడ అవకాశం కల్పిస్తానన్నారు. నన్ను విమర్శించిన వారికి కూడా అవకాశం కల్పిస్తానన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని అందులో అనుమానం లేదన్నారు. మార్కెట్ పనులు త్వరగా త్వరగతిన పూర్తిచేసి అందులో మిమ్మల్ని కూర్చోబెడతానన్నారు. అధికారం పక్షంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా శ్రమించే పేదవారి కోసం ఎప్పుడు పోరాడతానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వ్యాపారస్తులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జీవాల పెంపకం లాభదాయకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

గొర్రెలు, మేకల పెంపకం లాభదాయకమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగసానిపల్లెలో శనివారం ఐటిడిఎ నెల్లూరు వారి సహకారంతో యానాది కుటుంబాలకు గొర్రెలు, మేకలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెలే ఎస్.రఘురామిరెడ్డి, ఒంగోలు జెసి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల వారి సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎపి ఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్స్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, పత్తూరు సర్పంచ్ గడ్డం రేణుక, సచివాలయం కన్వీనర్ గోపాల్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మురళిమోహన్‌రెడ్డి, ఎంపిటిసి దొరవారి రాముడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

కాస్ట్రో స్ఫూర్తితో 'ఉక్కు' పోరాటం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విప్లవం అంటే ఫిడెల్ కాస్ట్రో అని, ఆయన స్ఫూర్తితో కడప ఉక్కు కోసం పోరాటం చేస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కిరణ్ పేర్కొన్నారు. స్థానిక భావన జూనియర్ కాలేజిలో కాస్ట్రో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ కాస్ట్రో విప్లవం అంటే కొందరికి ఉలికిపాటు, మరి కొందరికి కలవరపాటన్నారు. కడప ఉక్కు కర్మాగారం కోసం ప్రతి విద్యార్థి పోరాటం చేయడానికి కదలాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు

అభివృద్ధి పనులు కనిపించలేదా..?

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో జరుగుతున్న అభివృద్ధి పనులు మీకు కనిపించలేదా అని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని విద్యార్థి విభాగ అధ్యక్షుడు పోరెడ్డి జశ్వంత్ రెడ్డి, మహేంద్ర, అర్జున్‌రెడ్డి, స్వర్ణకారుల సంఘ ఉపాధ్యక్షుడు కిరణ్ బుగ్గయ్య చౌదరిని ఉద్దేశించి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీటెక్ రవిని అక్రమంగా అరెస్టులు చేయలేదని, పోలీసులపై దాడి చేసిన సంఘటనలో అరెస్టు చేశారన్నారు. టిడిపి ఉనికి కాపాడుకునేందుకే ఆ పార్టీ నాయకులు వైసిపి వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. బెటింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తిని ఎలా ప్రజలు గెలిపిస్తారని వారు ప్రశ్నించారు. సిఎం జగన్‌పై అనవసరమైన ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు.

'సిద్దేశ్వరం'తోనే రాయలసీమకు న్యాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సిద్దేశ్వరం బ్యారేజి నిర్మాణంతోనే రాయలసీమకు న్యాయం జరుగుతుందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ డ్యాం, సిద్దేశ్వరం అలుగు ప్రతిపాదన ఉందని, దాన్ని కొన్ని దశాబ్దాల కిందటే పలు రాజకీయ కారణాలతో ఆపేశారని, కృష్ణపెన్నార్ ప్రాజెక్టును కొంతమంది రాజకీయ నాయకులు ఆపేశారని తెలిపారు. అదే కృష్ణపెన్నార్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రాయలసీమ సస్యశ్యామలం అయి ఉండేదన్నారు. రాయలసీమకు చెందిన ప్రతి ఒక్కరు ఈ నిర్మాణానికి మద్దతు తెలపాలని ఆయన కోరారు.

మహిళకు రక్త దానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని తాతిరెడ్డి రామలింగారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అంజలి అనే గర్భిణికి ఎ పాజిటివ్ రక్తం అవసరం కాగా.. వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావుని సంప్రదించారు. ఇందుకు ఆయన స్పందించి ఫౌండేషన్ సభ్యుడు యస్.అహమద్ హుస్సేన్‌చే రక్తదానం చేయించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు పాల్గొన్నారు. రక్తదాత యస్.అహమద్ హుస్సేన్, ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రక్తదానం చేస్తున్న అహమద్ హుస్సేన్

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయరాదు

ప్రజాశక్తి - వేంపల్లె

టిబి (క్షయ) వ్యాధిపై రోగులు నిర్లక్ష్యం వహించరాదని టిబి యూనిట్ వైద్యులు నిజాముద్దీన్ సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టిబి రోగులకు పవర్‌గ్రిడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా మందులు, పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యాధిని తొందరగా గుర్తించి మందులు, పౌష్టికాహారం తీసుకుంటే బాగవుతుందన్నారు. టిబి వ్యాధిని 2025 నాటికి నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రామ్మోహన్, అసిస్టెంట్ సుబ్బయ్య, టిబి సూపర్‌వైజర్లు కూమార్, లక్ష్మీతేజ, ల్యాబ్ టెక్నిషియన్లు విజయ, శశికళ, రాములు నాయక్ పాల్గొన్నారు.


పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

రోడ్డు బాగు కోసం.. యువత శ్రమదానం

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రంలోని సిఎంఆర్ కాలనీలో ఉన్న ప్రధాన రహదారి మురికి కూపంగా మారి, దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామ పరిపాలన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీన్నిన గమనించిన స్థానిక సిఎంఆర్ కాలనీ సిఎస్ఐ చర్చ్ యూత్ నడుం బిగించి రహదారిలోని గుంతలను పూడ్చడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికైనా గ్రామ పరిపాలన పంచాయతీ వారు శ్రద్ధ వహించి గ్రామంలో గుంతలను పూడ్చి రోడ్లపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. యువత శ్రమదానాన్ని గుర్తించిన ప్రజలు అభినందించారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీ సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి మాస్టర్ సూర్య వారి చిన్నారులచే క్లాసికల్, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నట్లు వివరించారు.

ఆడపిల్లలనూ చదివిద్దాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వేంపల్లె

మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను కూడా పెంచాలని, చదివిద్దామని ఎంపిడిఒ దివిజా అన్నారు. శనివారం మండల సమాఖ్య వెలుగు ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింస వ్యతిరేకంగా డ్వాక్రా మహిళలు వేంపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లకు వివాహం చేయరాదని చెప్పారు. ఆడపిల్ల అనే భావన మనసులో ఉండకూడదని చెప్పారు. ఆడపిల్ల ఇంటి మహలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఎపిఎం బాలస్వామి, సమాఖ్య సభ్యులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, వెలుగు సిసిలు, విఒవోలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సమాఖ్య సభ్యులు

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం పురస్కరించుకొని అయ్యప్ప, శివ మాలధారణ భక్తులకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, సింగిల్ విండో ఈశ్వరయ్య ప్రారంభించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు మఠం శివస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేసిన వరప్రసాద్‌ను అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు యర్వా వెంకట్ సుబ్బయ్య, రసూల్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, కో-ఆప్షన్ మెంబెర్ దాసరి చంద్రమౌళి, డేరంగుల చంద్రమౌళి, డానియల్ బాబు, వేణు యాదవ్, నాగరాజు, ప్రశాంత్, రాజా పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో ఘనంగా పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

కార్తీక మాసంలో జరిగే పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవరోజు శనివారం వేద పారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారా తోరణం, అగ్ని ప్రతిష్ట, లఘు పూర్ణాహుతి, గోష్ఠి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి దంపతులు, చైర్మన్ పినుప్రోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీ రామ్ దీన్ చౌదరి నాలుగు వేల మంది భక్తులకు అన్న ప్రసాదం వండి వడ్డించడం విశేషం.

-గండి క్షేత్రంలో పాపాఘ్ని నదీ తీరాల ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఉత్తర భాగాన కొండపై వెలసిన శ్రీశ్రీశ్రీ శనైశ్చరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. త్రయోదశి కావడంతో స్వామికి భక్తిశ్రద్ధలతో తైలాభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వేంపల్లి రామకృష్ణ, అర్చకులు మణితేజ స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్ : కార్తీకమాసం సందర్భంగా భక్తుల కోసం పంచక్షేత్ర దర్శిని ప్రత్యేక బస్సును మూడు సోమవారాలు నడుపుతున్నట్లు డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు పులివెందులలో ఉదయం అయిదు గంటలకు బయల్దేరి యాగంటి, నందవరం, మహనంది, రామేశ్వరం(ప్రొద్దుటూరు)కన్యతీర్థం చూసుకొని తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు పులివెందుల చేరుతుందన్నారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాల కోసం న్యూ బస్టాండు విచారణ నంబర్ 73829 34750, డిఎంఇ 738 28,67696, ఎస్‌టిఐ 79898 99479, డిఎం 99592 25780 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోవర్ధన్‌రెడ్డి ఆ ప్రకనటలో కోరారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, PRODDATUR

O.S.No. 245/2020

Pochana Sreenivasula Reddy, S/o Late Bala Konda Reddy, Hindu, Aged about 45 years, Business, D.No.20/435, Modempalli Street, Proddatur Town and Mandal, Kadapa District.

...Plaintiff

Vs

Majjari Raja, S/o Sreenu, aged about 38 years, Working as Employee in R&B Department, D.No.5/133-B, Near Police Station, Muddanur Town and Mandal, Kadapa District.

...Defendant

దావా సమను

పై నంబరు దావాను వాది ప్రతివాది అయిన మీ పై దావా బాకి రాకోరి దావా దాఖలు చేసి వుంటూ వున్నాడు. అయితే అట్టి దావా నందు పలుమార్లు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా సమనులు పలుమార్లు పంపిననూ కావలయినని తీసుకొనడం లేదు. అందుకు గాను రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారము మీరు 30/11/2023వ తేదీన మీరు స్వయంగా హాజరు అగుటకు గాను ఉదయం 10.30 గంటలకు వాయిదా వుంటూ వున్నది. లేని ఎడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 30/11/2023.

//By Order of the Court//

N.KIRAN KUMAR, B.Com.,B.L.,
Advocate,
PRODDATUR